కథ

# ఆడపిల్ల

## మల్లాది రమాంజలి

"వెళ్ళగానే ఫోన్ చెయ్యి తల్లీ...ఒక్కదానివే వెడుతున్నావు" అప్పటికి పదోసారి చెప్పారు అమ్మా, నాన్నా!

"నాకేం భయం లేదు నాన్నా! ఊరికే కంగారు పడుతున్నారు..అనకాపల్లి నాకేమన్నా కొత్తా! ప్రతి శలవులకీ వెళ్ళటం లేదూ" నవ్వుతూ అన్నది మానస.

బస్సు బయలుదేరింది.

పదకొండోసారి జాగ్రత్తలు చెప్పి పార్కింగ్ వైపు కదిలారు మానస తల్లిదండ్రులు. బ్యాగ్ నుంచి మంచి ఇంగ్లీష్ నావెల్ ఒకటి తీసి చదువుకుంటూ కూర్చుంది మానస. ఆ సంవత్సరమే డిగ్రీ ఫైనల్ పరీక్ష రాసి మేనత్తగారింటికి శలవులు గడపటానికి వెడుతోందామె.

తమ ఊరు నుంచి మూడు గంటలు ప్రయాణం అనకాపల్లికి. కండక్టర్ రాగానే టికెట్ తీసుకొని సీట్‌లో సర్దుకు కూర్చుంది. మరో పది నిమిషాలకు బస్సు ఏదో ఊళ్ళో ఆగింది. ఓ పదిమంది ప్రయాణీకులతోపాటు హడావిడిగా చేతిలో మూడు నెలల పసికందుతో బస్సు ఎక్కిన ఓ పాతిక సంవత్సరాల అమ్మాయిని చూడగానే తను కాస్త పక్కకు జరిగి ఆమెను కూర్చోమన్నది మానస. చక్కని కను ముక్కు తీరు, వంకుల జుట్టు, నిమ్మపండులాంటి శరీర ఛాయతో మెరిసిపోతున్న ఆమె వంక రెప్ప వాల్చకుండా ఓ నిమిషం చూస్తుండిపోయింది మానస.


మానస ముఖంలోకి చూస్తూ పలకరింపుగా నవ్వింది ఆమె. మరో ఐదు నిముషాలకు నిశితంగా ఆమెను గమనించటం మొదలుపెట్టింది మానస. ఆమె చేతులు ఎందుకో ఒణుకుతున్నాయి. మాటి మాటికీ పెదవులు తడి చేసుకుంటోంది. పసిపిల్లను చేత్తో ఆప్యాయంగా తడుముతోంది. ఆమె ఎందుకో బలవంతంగా దుఃఖాన్ని ఆపుకుంటోందా అనిపించింది మానసకి.

"మీ పేరేమిటి? ఎక్కడికి వెడుతున్నారు" మాట కలిపింది ఆమెతో.

"ఎక్కడికో" అంటూ గొణికింది ఆమె.

"నా పేరు రంజని" చెప్పింది. మెళ్ళో పసుపుతాడు, చేతులకు ఎర్రని మట్టిగాజులు, కాళ్ళకు అరిగిపోయినట్టున్న మట్టెలు, చౌకరకం వాయిల్ చీర ఆమె బీదరికాన్ని బయటపెడుతున్నాయి. ఓ క్షణం జాలిగా ఆమె వంక చూసింది మానస.

చేతిలో పసికందు గులాబీపువ్వులా సున్నితంగా వుంది.



"మీ పాప చాలా ముద్దుగా ఉంది రంజని గారూ! ఇంతకీ పాపా, బాబా?" ప్రశ్నించింది.

"పాపే" నిర్లిప్తంగా సమాధానం చెప్పింది రంజని.

"పేరేమిటి?" ప్రశ్నించింది మానస.

"ఇంకా పేరు పెట్టలేదు..మా అమ్మగారింటికి అనకాపల్లి వెడుతున్నాను" కొంచెం మనస్సు కుదుట పడింధో ఏమో ఆమె మాటల్లో పడింది. ఒకరి వివరాలు ఒకరు చెప్పుకున్నారు.

పెద్దలకు ఇష్టం లేకుండా తమకంటే తక్కువ స్థితిలో ఉన్న తన క్లాస్‌మేట్‌ని ప్రేమించి పెళ్ళి చేసుకున్నట్లుగా చెప్పింది రజని. పాప పుట్టాక తమ కుటుంబాల మధ్య మళ్ళీ సంబంధాలు ఏర్పడినాయని..తన తండ్రి ఓ పెద్ద బిజినెస్ మాగ్నెట్ అనీ..తనకో తమ్ముడు ఉన్నాడనీ..స్టేట్స్‌లో చదువుతున్నాడనీ చెప్పింది. మరో అర గంట కబుర్లలో పడిపోయారు.

ఇంకో అరగంటలో అనకాపల్లి వస్తుందనగా పాప సడన్‌గా ఏడుపు మొదలుపెట్టింది. చేతిలో ఉన్న పాల బాటిల్ పిల్ల నోట్లో పెట్టింది. అందులో ఉన్న నాలుగు చుక్కలూ పీల్చేసి మళ్ళీ ఏడుపందుకుంది పాప.

"ఇదిగో..ఈ బాటిల్‌లో

"నీళ్ళు పిల్లకు పట్టించి ఊర్కో పెట్టవమ్మా తల్లీ..చెవి కింద ఓ మోత..." తన చేతిలోని నీళ్ళ బాటిల్ అందించి మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడో ప్రయాణీకుడు.

బస్సు ఓ చిన్న టౌన్‌లాంటి ఊళ్ళో ఆగింది.

"ఏదన్నా హోటల్లో పిల్లకు పాలు దొరుకుతాయేమో తీసుకువస్తాను" అంటూ బాటిల్ పట్టుకొని, పిల్లను మానస ఒడిలో పెట్టి క్రిందకు దిగింది రంజని. నిమిషాలు గడుస్తున్నా రంజని తిరిగి రాలేదు. రైట్..రైట్..అంటున్నాడు కండక్టరు.

మానస కంగారుగా "ఆపండి..డ్రైవర్ గారూ..ఒకామె క్రిందకు దిగి రాలేదు. వాళ్ళ పాప ఏడుస్తోంది..ఒక పది నిమిషాలు ఆపండి" అన్నది.

"ఇంకెంత సేపమ్మా! బండి ఆపి ఇరవై నిమిషాలు అయింది" డ్రైవర్ విసుక్కున్నాడు.

"పాపను మాకు ఇచ్చి ఆమె ఎటు వెళ్ళిందో చూసి రామ్మా!" వెనక సీటులోని పెద్దావిడ సలహా ఇచ్చింది.

"మానస పాపను ఆమె చేతిలో పెట్టి కిందకు దిగి అంతా చూసింది"

రంజని కనుచూపు మేరలో ఎక్కడా కనపడలేదు.

"అయ్యో! ఆమె ఎటు వెళ్ళిందో..పాపను ఒదిలేసి వెళ్ళింది" మానసకి ఏడుపు ముంచుకు వచ్చింది. ఆమెకు కాళ్ళూ, చేతులూ ఆడటం లేదు. రంజని ఇలా చేసిందేమిటి? ఆమె చెప్పిన కథ నిజమేనా? మనస్సు పరి పరి విధాలా పోతుండగా..కండక్టరు కస్సుమనటంతో బస్సెక్కి తన సీట్లో కూర్చుండిపోయింది మానస.

"ఇదేం కేసో..అక్కడక్కడ తిరిగొచ్చిన బాపతు అయ్యుంటుంది..పిల్లను బలే తెలివిగా వదిలించుకుంది" తలో మాటా అంటున్నారు.

"ఇదిగోమ్మా పాపా! ఇంకో పావుగంటలో అనకాపల్లి వెళ్ళిపోతాం..అక్కడ మీ పెద్దవాళ్ళను తీసుకొని వెళ్ళి ఏ పోలీస్ స్టేషన్‌లోనో, ఏ శరణాలయంలోనో పిల్లను అప్పచెప్పేయ్" తేలిగ్గా చెప్పేసి బస్సు స్టార్ట్ చేసాడు డ్రైవరు.

"మీరిద్దరూ అంతలా మాట్లాడుకుంటుంటే చుట్టాలేమో అనుకున్నాను. కాదన్నమాట" సాగదీసింది ఓ నడివయసామె.

"ఇంతకీ ఆ అమ్మాయికి పెళ్ళీ గిళ్ళీ అయిందోలేదో చూసావా" ఓ సందేహాల పుట్ట ప్రశ్న.

"పిల్ల ముద్దులు మూటకడుతోంది..ఆ మహాతల్లికి చేతులెలా వచ్చాయో ఒదిలిపెట్టటానికి..పాపం ఏవో కష్టాలొచ్చి ఉంటాయి. ఆ! ఎంత కష్టాలొచ్చినా..బిడ్డని వదిలిపెడుతుందా పాపిష్టిది" రకరకాల వ్యాఖ్యానాలు.

ఇవేవీ వినపడటం లేదు మానసకి. భయంతో తల దిమ్మెక్కిపోయింది. పాపను ఏం చెయ్యాలో అర్థం కావటంలేదామెకి. అసలే మేనత్త పరమ ఛాందసురాలు.

కులం, గోత్రం అంటూ పిల్లను ఇంట్లోకి రానిస్తుందా! ఇంత పసిదానిని ఏం చెయ్యాలి? మానసకి ఏడుపు ముంచుకొచ్చింది. తనకు తెలీకుండానే గట్టిగా ఏడ్చేసింది. డ్రైవర్‌కి జాలేసినట్టుంది. బస్సు ఓ పక్కకి తీసి ఆపేశాడు.

ప్రయాణీకులంతా మానస దగ్గరకు వచ్చి ఓదార్చారు. "బస్సు దగ్గరకు మీ వాళ్ళెవరూ రాకపోతే మేము వచ్చి మీవాళ్ళ ఇంట్లో దింపుతామని" హామీ ఇచ్చారు కొందరు.

"నీ దగ్గర సెల్‌ఫోన్ ఉంటే మీవాళ్ళకి ఫోన్ చేసి చెప్పు" ఒకాయన సలహా ఇచ్చారు.

కొంచెం ధైర్యం కూడదీసుకుంటూ హేండ్ బేగ్ నుంచి సెల్ తీసి తండ్రికి ఫోన్ చేసి అనకాపల్లి త్వరగా రమ్మని చెప్పింది మానస.

పిల్ల బయలుదేరి కొన్ని గంటలన్నా కాలేదు. ఇంతలో ఈ ఫోనేమిటని ఆమె తల్లిదండ్రులు కంగారుగా వెనక బస్సులోనే అనకాపల్లి బయలుదేరారు. మానస ఎక్కిన బస్సు మెల్లగా అనకాపల్లి చేరుకుంది.


అప్పటికే ఆమె మేనత్త కొడుకు 'విజయ్' ఎదురుచూస్తున్నాడు. చేతిలో పసిపిల్లతో...ఏడుపు ముఖంతో దిగిన మానసను ఆశ్చర్యంగా చూశాడు. "జాగ్రత్తమ్మా! మీ వాళ్ళు ఎవరో వచ్చినట్లున్నారు. పిల్లను ఏ శరణాలయంలోనో అప్పచెప్పెయ్...చిన్నపిల్లవు..నీకెందుకు ఈ లంపటం" తలో రకంగా చెప్పి తోటి ప్రయాణీకులంతా ఎక్కడివాళ్ళక్కడ వెళ్ళిపోయారు.

"ఏమిటి మానసా! ఎవరీ పాప?" ప్రశ్నిస్తున్న విజయ్ చెయ్యి పట్టుకొని గబగబా కనపడిన ఆటో ఎక్కి అడ్రస్ చెప్పింది మానస. జరిగిన కథంతా విజయ్‌కి వివరించింది. అంతా విన్న విజయ్ ఆశ్చర్యపోయాడు. ఏం చెయ్యాలో అతనికీ అర్థం కాలేదు. పాపను ఇంటికి తీసుకువెడితే తల్లి ఏమంటుందోనన్న జంకు...మానసను చూస్తే జాలేసిందతనికి.

"అత్తయ్యా, మామయ్యా బయలుదేరారు కదా మానసా! వాళ్ళు వచ్చాక పోలీస్ కంప్లైంట్ ఇద్దాము. నువ్వేమీ భయపడకు..అమ్మకు నేను ✓

## మరో బొద్దుగుమ్మ

తెలుగునుంచి తమిళ రంగానికెళ్ళిన నమిత 'బొద్దుగుమ్మ'గా భారీ అందాలతో కనిపిస్తున్నట్టే నిన్నటివరకూ తెలుగులో నటించిన ఫర్జానా కూడా తమిళ రంగానికెళ్లిందీమధ్య. శరత్ కుమార్ హీరోగా నటిస్తున్న '1977' అనే సినిమాలో నమితతోపాటు మరో కథానాయికగా నటిస్తోంది. తెలుగులో చాన్సులు తగ్గినప్పటి నుంచీ కాస్త 'లావు'గానే తయారైన ఫర్జానా ఈ సినిమాలో మరింత 'భారీ'గా కనిపించనుందని కోలీవుడ్ వార్తలు. ఈ సినిమా తెలుగులోకి అనువాదం అవుతుందిట. అప్పుడు ఫర్జానా 'బొద్దుగుమ్మ'గా మన జనాల్ని ఎంతవరకూ ఆకట్టుకుంటుందో.



"నర్దిచెపుతాలే" అన్నాడు. అతని మాటలకు కొంచెం ధైర్యం వచ్చింది మానసకి.


* * *

"వస్తూ వస్తూ ఈ శనిని వెంట పెట్టుకొచ్చావేమిటే..పిల్లను ఆ బస్సులోనే వదిలేసి రాకపోయావా!...నీలాంటిదే ఒకతె ఇలాగే మంచికిపోతే నంచిపోయిందట. ఆ బస్టాండులోనే బల్లమీద పిల్లని పడుకోబెట్టి చక్కారాక వెంటనేనుకొచ్చింది. అవ్వా! నలుగురూ దీనికి నెలతప్పి పిల్లనెత్తుకొచ్చిందంటే నా తమ్ముడి పరువేం కావాలి? అయ్యో! అయ్యో! ఇదెక్కడి విడ్డూరం" పదోసారి బుగ్గలు నొక్కుకుంది మానస మేనత్త అచ్చమాంబ.

"నువ్వూరుకోవే అమ్మా! మానస అసలే భయపడిపోయింది. నువ్వింకా భయపెట్టకు..వాళ్ళ అమ్మా, నాన్నా వస్తున్నారు కదా! ఏ విషయం వాళ్ళే చూస్తారు" తల్లికి నచ్చచెప్పాడు విజయ్. ఈ లోపు పసిపిల్ల ఏడుస్తుంటే బజారుకెళ్ళి ఓ పాలసీసా కొనుక్కొచ్చాడు. విసుక్కుంటూనే ఓ గుక్కెడు పాలు వెచ్చపెట్టి ఇచ్చింది అచ్చమాంబ. పాలు త్రాగి హాయిగా నిద్రపోయింది పాప. మరో అరగంట గడిచాక మానస తల్లిదండ్రులు కంగారుగా ఇంట్లోకి అడుగుపెట్టారు. జరిగినదంతా పూస గుచ్చినట్లు, వన్నెలూ, చిన్నెలూ పెట్టి వివరించింది అచ్చమాంబ. కథంతా విని వాళ్ళూ ఆశ్చర్యపోయారు. పసిపిల్లలను చూసి ఎన్నో ఏళ్ళు అయినట్లుంది. ఎంత ముద్దుగా ఉందో ఈ పాప అంటూ ఆనందరావు, సుమిత్ర ఎంతో ముచ్చటపడిపోయారు.

"ఏమిట్రా తమ్ముడూ! అంత ముచ్చటపడిపోతున్నారు. కొంపదీసి పెంచుకుంటారా ఏమిటీ" అచ్చమాంబ సాగదీస్తూ..మూతి మూడు వంకర్లు తిప్పి గదిలోకి వెళ్ళిపోయింది. భోజనాలవీ ముగించాక విజయ్, ఆనందరావూ పోలీస్‌స్టేషన్‌కి బయలుదేరారు. ఈ లోపు తన దగ్గర వున్న కెమేరాతో పాపను ఓ ఫోటో తీసి తండ్రికి ఇచ్చింది మానస. పోలీస్ ఇన్‌స్పెక్టర్ కేసు రాసుకుని పాప ఫోటో తీసుకొని ఎవరన్నా వస్తే తప్పకుండా ఇన్‌ఫాం చేస్తానని ఫోన్ నంబర్, ఇంటి అడ్రస్ తీసుకున్నాడు. పాప ఫోటోతో పేపర్‌లో, టీవీలో ప్రకటన ఇప్పించడని సలహా ఇచ్చాడు.

పదిహేనురోజులు గడుస్తున్నా పసిపిల్ల తాలూకు మనుషులు ఎవరూ రాలేదు. అచ్చమాంబకు ఆ పిల్లను చూస్తుంటే గొంగళిపురుగును చూసినంత కంగారుగా వుంది. ఎవరూ రాకపోతే ఏ శరణాలయంలోనో వదలాలి గానీ సొంత బిడ్డను సాకినట్టు సాకుతారేమిటని కసిగా అనుకుంటోంది. మరో రెండు రోజులు చూసి మానసను తీసుకొని వాళ్ళ ఊరుకు బయలుదేరారు ఆనందరావూ, భార్య.



రోజురోజుకూ ముద్దుగా పెరుగుతున్న ఆ బిడ్డను చూస్తుంటే ఎక్కడా వదలబుద్ధి కాలేదు వాళ్ళకి. ఆ పాపే మానస జీవితానికో మచ్చ అవుతుందని ఆ క్షణంలో వాళ్ళు ఊహించలేదు.

* * *

డిగ్రీ పూర్తి చేసి పి.జి.లో చేరింది మానస. పాప స్వీటీగా వాళ్ళ ఇంట్లో కొన్ని నెలలు పెరిగాక మానస పినతల్లికి ఆడపిల్లలు లేకపోవటంతో ఆమె పెంపకానికి తీసుకుంది. కొత్త కాలేజీ, కొత్త స్నేహితులు, కొత్త వాతావరణం, పూర్తిగా చదువులో మునిగిపోయిన మానస గతంలో జరిగిన సంఘటనలన్నీ పూర్తిగా మరచిపోయింది. మానస డిగ్రీ కాగానే తన కొడుక్కిచ్చి పెళ్ళిచేస్తాదనే ఉద్దేశంలో ఉన్న అచ్చమాంబ, తమ్ముడు ఆ ఊసే ఎత్తకపోవడంతో విజయ్‌కి వేరే సంబంధం చూసి పెళ్ళి చేసేసింది. మానస పి.జి. ఫైనల్‌లో ఉండగా పెళ్ళి సంబంధాలు చూడటం మొదలుపెట్టాడు ఆనందరావు.

స్నేహితుడు చక్రపాణి ద్వారా ఓ మంచి సంబంధం తీసుకువచ్చాడు ఆనందరావు. పిల్లవాడు ఇంజనీరు. మంచి జీతంతో మంచి ఉద్యోగం, సొంత డబ్బుతో ఓ ఫ్లాట్ కొనుక్కుని స్థిరపడ్డాడతను. మానసను చూసి నచ్చిందన్నారు. నిశ్చయ తాంబూలాలకు తేదీ నిర్ణయించుకున్నారు. మానస తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. ఉన్న ఊళ్ళోనే ఒక్కగానొక్క పిల్ల స్థిరపడుతోందంటే ఏ తల్లిదండ్రులు సంతోషించరు. పెళ్ళిపనులు చురుకుగా సాగుతున్నాయి. ఓ రోజు పిడుగులాంటి వార్త మోసుకొచ్చాడు చక్రపాణి.

మానస నడవడి మంచిది కాదని, ఆమె రహస్యంగా కన్నబిడ్డ ఆమె పినతల్లి దగ్గర పెరుగుతోందని, కాబట్టి పెళ్ళి రద్దు చేసుకుంటున్నామని దాని సారాంశం. తను ఎంతో చెప్పి చూశాననీ, మానస ఒద్దికగల పిల్ల అనీ, తనకు ఏ పాపం తెలియదని, పెళ్ళివారికి నచ్చచెప్పటానికి శతవిధాలా ప్రయత్నించానని చెప్పాడు చక్రపాణి. పీటలవరకూ వచ్చిన పెళ్ళి ఆగిపోవటంతో మానసికంగా కృంగిపోయారు మానస తల్లిదండ్రులు. పెళ్ళి పనులకు పదిరోజులు ముందుగా వచ్చిన అచ్చమాంబ నిష్టూరాలు పుండుమీద కారం చల్లినట్టుంది వాళ్ళకి. ఏ పాపం తెలియని పసిబిడ్డ స్వీటీని ఆడిపోసుకోవడానికి వాళ్ళకు మనసు రాలేదు. తమ బిడ్డకు రాసి పెట్టి ఉన్న వరుడు ఎక్కడో ఒక చోట ఉండకపోడులే అని సరిపెట్టుకొని బ్రతుకు వెళ్ళదీస్తున్నారు. తమ బిడ్డ తెలిసిగానీ, తెలియకగానీ ఎవరికీ హాని తలపెట్టలేదనీ, ఏ పాపం తెలియని తమ బిడ్డకు తప్పక మంచి

## అమ్మే నా ఫ్రెండ్

కుర్రహీరోయిన్ శ్వేత బసు ప్రసాద్‌కి ఇప్పుడు బాలీవుడ్‌లో బాగానే పాపులారిటీ వచ్చేసింది. తనకి వస్తున్న ఈ క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని 'పర్సనాలిటీ' విషయంలో తగు జాగ్రత్తలు తీసుకున్నానంటోంది. ఎందుకంటే ఇంత చిన్న వయసులోనే 'బొద్దు'గా తయారైంది కదా! అదలా వుంటే తనకి బెస్ట్ ఫ్రెండ్ అంటూ ఎవరైనా వున్నారూ అంటే అది తన మమ్మీయేనంటుంది శ్వేత. నిజంగా తన తల్లి ఎంకరేజ్‌మెంట్ తన కెరీర్‌కి ఎంతో 'బూస్ట్'నిస్తుందని ఏమాత్రం అవకాశం వచ్చినా తెగ పొగుడుతుంటుంది శ్వేత.

రోజులు వస్తాయని గట్టిగా అనుకున్నారు వాళ్ళు.

పి.జి. అవగానే తను చదివిన కాలేజీలోనే లెక్చరర్‌గా చేరిపోయింది మానస. విద్యార్థి దశనుండి ఉపాధ్యాయ దశకు రావటం ఆమెకు కొత్తగా ఉంది.

మానసకు సంబంధాలు చూస్తూనే ఉన్నాడు ఆనందరావు. ప్రతి సంబంధానికీ స్వీటీ అడ్డురావటంతో వెనక్కి వెళ్ళిపోతున్నారు పెళ్ళివారు. సుమిత్ర ఆరోగ్యం దెబ్బతింది. తల్లి మానసిక వ్యాధితో మంచం పట్టటంతో ఇటు ఇంటి పనితో, అటు కాలేజీకి వెళ్ళి రావటంతో శారీరకంగా, మానసికంగా అలిసిపోతోంది మానస.

ఓ రోజు-

ఇంటిపనంతా చేసుకుని కాలేజీకి బయలుదేరుతున్న మానసకు చేతిలో ఏదో కవరుతో పక్కింటి కుర్రాడు ఎదురయ్యాడు. "మానసక్కా! పోస్ట్‌మేన్ మా ఇంటి గేట్‌లో పెట్టాడు ఈ కవరు. నిన్ననే ఇద్దామనుకొని మర్చిపోయాను" కవరు చేతిలో పెట్టి రివ్వున పరిగెత్తాడు వాడు.

తన పేరు మీద వచ్చిన ఆ లావుపాటి కవరును అటు ఇటూ తిప్పి చూసింది మానస. ఫ్రం ఎడ్రస్ ఎక్కడా కనపడలేదామెకు. మెల్లగా కవరు తెరిచి చూసింది. అందులో

"మానసా!

నేనెవరో నీకు తెలీదు. నా పేరు రంజని. గుర్తుపట్టావా! రెండు సంవత్సరాల క్రితం నా పాపను నీ చేతుల్లో పెట్టి వెళ్ళిపోయాను. నేను నీకు తెలీదు మానసా! కానీ నీవు నాకు తెలుసు. నీ స్నేహితురాలు మాధవి మా మేనత్త కూతురు. మీ కాలేజీ ఫోటోల్లో నిన్ను చూసాను. మాధవి నీ గురించి ఎప్పుడూ చెపుతూ వుండేది. కోటీశ్వరుడైన తండ్రికి ఒక్క ఆడపిల్లగా పుట్టాను నేను. నేల మీద నడిస్తే కందిపోయేంత గారాబంగా పెరిగాను. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన వినీత్‌తో ప్రేమలో పడ్డాను. ఇంట్లో చెప్పకుండా పెళ్ళి చేసుకున్నాను. నా సర్వస్వం అతనే అనుకొని మోసపోయాను. నా డబ్బు మీద ప్రేమతో అతను నన్ను పెళ్ళి చేసుకున్నాడని పాప పుట్టాక తెలిసింది నాకు. చేసుకున్న వాడి ప్రేమ దొరక్కపోగా గయ్యాళి అత్తగారి ఆరళ్ళకు బలైపోయాను. నిత్యం సాధింపులు, వేధింపులు, బెదిరింపులతో విసిగిపోయాను. నాకు పుట్టింది ఆడపిల్ల కావడంతో అత్తగారి వేధింపులు ఎక్కువయ్యాయి. పాప నోట్లో వడ్లగింజ వేసి చంపుతానని బెదిరించేది. పాపను కళ్ళల్లో వత్తులు వేసుకొని కాపాడాను. చివరకు భర్త, అత్తగారి వేధింపులు భరించలేక ఒకరోజు ఇంటినుంచి బయటపడ్డాను. మా అమ్మగారింటికి వెళ్ళి పాపను వాళ్ళ సంరక్షణలో ఉంచుదామనుకున్నాను గానీ..అభిమానం అడ్డు వచ్చింది.

అదృష్టవశాత్తూ బస్‌లో నీవు కనిపించావు. ప్రతి సంవత్సరం నీ పుట్టినరోజున అనాథ పిల్లలకు స్వీట్లు పంచుతావనే విషయం మాధవి ఎప్పుడూ చెపుతూ వుండేది. మీ కుటుంబం ఆదర్శకుటుంబమని మాధవి చాలాసార్లు నాతో చెప్పింది. నా పాపను మీ సంరక్షణలో వుంచితే ప్రాణగండం వుండదని, నా భర్తకు తెలియని చోట పెరుగుతుందని నమ్మాను. అందుకే ధైర్యం చేసి నీ ఒడిలో పెట్టాను.



కానీ నా పాప నీ భవిష్యత్తుకు అడ్డుతగలటం నేను భరించలేకపోయాను మానసా! ఈ రెండు సంవత్సరాలలో చిన్న చిన్న ఉద్యోగాలు చేసి పొట్ట పోసుకుంటూ ఇప్పుడు నా పాపను పోషించుకోగలిగే స్థితికి చేరుకున్నాను. మీకు దూరంగా ఉంటూ మీ ప్రతి కదలికను గమనిస్తున్నాను. నా పాప ఏదో ఒకచోట సురక్షితంగా పెరుగుతోందనే ధైర్యంతో బ్రతుకుతున్నాను. నా తమ్ముడు విదేశం నుంచి తిరిగి వచ్చాడని తెలుసుకొని వాడిని కలుసుకున్నాను. నా కథ విని వాడు సహృదయంతో అర్థం చేసుకున్నాడు. నిన్ను పెళ్ళాడటానికి సిద్ధంగా వున్నాడు. అతిదీనంగా వున్న నా పరిస్థితిని కళ్ళారా చూసి అమ్మా, నాన్నల దగ్గరకు నన్ను తీసుకువెళ్ళాడు. నా పరిస్థితికి వాళ్ళూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు. మానసా! ఒక ఆడపిల్లగా పుట్టి, నా ప్రవర్తనతో తల్లిదండ్రుల గుండెల్లో చిచ్చు పెట్టాను. ఒక ఆడపిల్లను కని, అది నీ జీవితానికి అడ్డుపడేలా చేసాను. నన్ను సాధింపులకు, వేధింపులకు గురిచేసిన మా అత్తగారు కూడా ఒక ఆడదే. కన్నతల్లినైనా బిడ్డను అనాథను చేసి, పరాయి పంచకు చేర్చిన నేనూ ఆడదాన్నే! నా బిడ్డ పసిబిడ్డ అయినా, నీ జీవితానికి అడ్డంకిగా నిలిచిన నా బిడ్డ కూడా ఆడదే. ఆడదానికి ఆడదే శత్రువన్న పురాణ కాలం నాటి సామెతను మనం తిప్పికొట్టాలి మానసా! నా పాప నీకు శత్రువు కాకూడదు. నీ పాత కథను నేను కొత్తగా రాస్తాను మానసా! నా తప్పును సరిదిద్దుకోవడానికి నీ జీవితం నా తమ్ముడితో ముడి పెడుతున్నాను. పాప నన్ను కన్నతల్లిగా అంగీకరించి వస్తే సంతోషిస్తాను. ఒకవేళ రాకపోతే తను సుఖంగా ఉండటం చూస్తూ జీవితం గడిపేస్తాను. నా తప్పులన్నీ మన్నిస్తావు కదూ మానసా! మంచి ముహూర్తం చూసి నిన్ను చేపట్టటానికి నా తమ్ముడు తప్పక వస్తాడు మానసా!

ప్రేమతో...

రంజని.

సుదీర్ఘమైన ఆ లేఖను చదివి అలాగే కూర్చుండిపోయింది మానస. కూతురిని సాగనంపటానికి బయటకు వచ్చిన సుమిత్ర, మానస చేతిలో రెపరెపలాడుతున్న ఆ ఉత్తరాన్ని అందుకుంది.

☆

## కృతజ్ఞతాభావం

కమలినీ ముఖర్జీని అతిథి పాత్రలు చేయమని ఎవరైనా అడిగితే 'నో' చెప్పేస్తుందిట. కానీ ఒక దర్శకుడికి మాత్రం ఆమె 'యస్' అనే అంటుంది. అతడు శేఖర్ కమ్ముల. తనని టాలీవుడ్‌కి పరిచయం చేసి తనకంటూ గుర్తింపు తీసుకొచ్చిన శేఖర్ అడిగితే మాత్రం తను ఎలాంటి గెస్టు పాత్రనైనా ఒప్పుకుంటానంటుంది. ఆ కృతజ్ఞతలో భాగంగానే 'హ్యాపీడేస్'లో గెస్ట్ రోల్ చేసింది కమలినీ. భవిష్యత్తులో తను గెస్టుగా వేరే చిత్రాలు చేయనుగానీ, శేఖర్‌గారు అడిగితే మాత్రం తప్పకుండా చేస్తానంటోంది. కృతజ్ఞత అంటే ఇలా వుండాలి కదా!